E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు

AUG 25


## తెలుసుకుందాం !

### ఆగస్టు 25: చరిత్రలో ఈరోజు

1609:గెలీలియో గెలీలి తన టెలిస్కోపును మొదటిసారిగా ప్రదర్శించాడు.

1867:ఆంగ్ల రసాయన శాస్త్రవేత్త మరియు భౌతిక శాస్త్రవేత్త మైకేల్ ఫెరడే మరణించారు.

1953:తెలుగు సాహితీకారుడు సురవరం ప్రతాపరెడ్డి మరణించారు.

1969:కార్మిక నాయకుడు, ఉర్దూకవి మఖ్దూం మొహియుద్దీన్ మరణించారు.

2012:నాసా వాయేజర్ 1 అంతరిక్ష నౌక ఇంటర్స్టెల్లార్ అంతరిక్షంలోకి ప్రవేశించింది.


సోమవారం తెలుగు గళం 25 ఆగస్టు తెలంగాణ - ఆంధ్రప్రదేశ్


## ట్రంప్ నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా పరిగణించాలి : నిక్కీ హేలీ



వాషింగ్టన్ : రష్యా నుండి చమురు దిగుమతులపై ట్రంప్ నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా పరిగణించాలని రిపబ్లికన్ నేత నిక్కీహేలీ శనివారం అన్నారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు భారత్, అమెరికాతో కలిసి పనిచేయాలని అన్నారు. వాణిజ్య విభేదాలు మరియు రష్యన్ చమురు దిగుమతులు వంటి సమస్యలను పరిష్కరణకు చర్చలు, సంప్రదింపులు ముఖ్యమని సోషల్‌మీడియా పోస్టులో పేర్కొన్నారు.

భారతీయ వస్తువులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50శాతం సుంకం విధించిన అనంతరం రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. దీనిపై నిక్కీ హేలీ గతవారం మీడియాలో వెల్లడించిన అభిప్రాయంలో కొంతభాగాన్ని ఎక్స్‌లో పేర్కొన్నారు. భారత్‌కు అనుకూలంగా వ్యవహరించడంతో సొంత పార్టీలోనే ఆమె విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా క్రూరమైన యుద్ధానికి నిధులు సమకూర్చడానికి సహాయపడే భారత్ భారీ రష్యన్ చమురు కొనుగోళ్లను ట్రంప్ లక్ష్యంగా చేసుకోవడం సరైనదే అని హేలీ తన వ్యాసంలో పేర్కొన్నారు. అయితే భారత్ చైనాలాగా విరోధిగా భావించకూడదని, స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య భాగస్వామిగా భావించాలని ఆమె పేర్కొన్నారు. రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్, అమెరికాల మధ్య దశాబ్దాల స్నేహం, విశ్వాసమే .. ప్రస్తుత అడ్డంకులను దాటేందుకు బలమైన పునాదిగా ఉపయోగపడుతుందని అన్నారు.

## త్వరలో కామన్ మ్యానిఫెస్టో

### బీహార్‌లో మంచి ఫలితాలు సాధిస్తాం

### మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ



పాట్నా : ఇండియా వేదిక పార్టీలు ఐక్యంగా పనిచేస్తున్నాయని, బీహార్‌లో మంచి ఫలితాలు సాధిస్తామని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. త్వరలో కామన్ మ్యానిఫెస్టో విడుదల చేస్తామని తెలిపారు. ఆయన అరారియాలో ఆర్‌జెడి నేత తేజస్వియాదవ్‌తో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపికి సహాయం చేయడానికి, ఓట్లను చోరీ చేయడానికి ఎన్నికల కమిషన్ చేసిన ప్రయత్నమే బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) అని అన్నారు. ఓట్లు చోరీ చేసేందుకు అనుమతించబోమని అన్నారు.

'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా బీహార్‌లో పర్యటిస్తున్న ఆయన ఎనిమిదో రోజు పూర్ణియా జిల్లా అరారియాలో తేజస్వీ యాదవ్‌తో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. వీధుల్లో మోటారు సైకిల్ నడిపారు. వీరిని చూడటానికి జనం భారీ సంఖ్యలో బారులు తీరారు. ఈ నెల 17న రాహుల్ గాంధీ ప్రారంభించిన ఓటర్ అధికార్ యాత్ర, 1300 కిలోమీటర్ల మేర కొనసాగనుంది. ఈ యాత్ర 16 రోజుల పాటు 20 జిల్లాలకు పైగా కొనసాగి, సెప్టెంబర్ 1న పాట్నాలో నిర్వహించే భారీ సభతో ముగియనుంది.

## సురవరం భౌతికకాయం గాంధీ ఆస్పత్రికి అప్పగింత



హైదరాబాద్ : సిపిఐ అగ్రనేత, ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి అంతిమయాత్ర ముగిసింది. తెలంగాణ ప్రభుత్వ అధికార లాంఛనాలతో మఖ్దూం భవన్ నుండి ప్రారంభమైన అంతిమయాత్ర-గాంధీ మెడికల్ కాలేజీ వరకు కొనసాగింది. అనంతరం కుటుంబసభ్యులు సురవరం భౌతికకాయాన్ని గాంధీ ఆస్పత్రికి అప్పగించారు.

## యుద్ధోన్మాది ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించాల్సిందే

### నెదర్లాండ్స్ (డచ్)లో ముగ్గురు మంత్రుల రాజీనామా



ఆమ్‌స్టర్‌డామ్ : అమెరికా అండతో గాజాలో మారణకాండ సాగిస్తున్న యుద్ధోన్మాది ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించాల్సిందేనని నెదర్లాండ్స్ (డచ్) విదేశాంగ శాఖ మంత్రి కాస్పర్ వెల్డ్‌కాంప్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం అందుకు నిరాకరించడంతో శుక్రవారం నాడు ఆయనతో పాటు మరో ఇద్దరు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. న్యూ సోషల్ కాంట్రాక్ట్ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న కాస్పర్.. ఇజ్రాయిల్ దిగుమతులపై నిషేధం విధించాలని, అక్కడి ఉన్నతాధికారులను దేశంలోకి అనుమతించ రాదని పార్లమెంటులో ప్రతిపాదించారు. భాగస్వామ్య పక్షాలు అందుకు మద్దతు ఇవ్వకపోవడంతో డచ్ ప్రభుత్వం ఇజ్రాయిల్‌పై ఆంక్షల విధింపునకు నిరాకరించింది. దీనికి నిరసనగా కాస్పర్, ఆయనకు మద్దతుగా మరో ఇద్దరు మంత్రులు రాజీనామా చేశారు. మరోవైపు ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కసరత్తు చేస్తున్నారు.

## రెండు కొత్త వైమానిక రక్షణ క్షిపణుల ప్రయోగం



ప్యోంగ్యాంగ్ : ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ రెండు "కొత్త" వైమానిక రక్షణ క్షిపణుల పరీక్షను పర్యవేక్షించారని స్థానిక మీడియా ఆదివారం ప్రకటించింది. కొత్త క్షిపణి ఆయుధ వ్యవస్థలు ఉన్నతమైన పోరాట సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని తేలిందని కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజన్సీ (కెసిఎన్ఎ) నివేదించింది. శనివారం ఈ ప్రయోగం చేపట్టారని, అయితే ఎక్కడ నిర్వహించిందీ వెల్లడించలేదు. ఆపరేషన్ మరియు రియాక్షన్ మోడ్ అసమానమైన మరియు ప్రత్యేక సాంకేతికతపై ఆధారపడి ఉంటుందని, వైమానిక లక్ష్యాలను ఎదుర్కొనేలా క్షిపణుల సాంకేతిక లక్షణాలు అనుకూలంగా ఉన్నాయని మీడియా తెలిపింది.

మిగతాది 3వ పేజీలో

## అంతరిక్షం నుంచి ఎంతో అందంగా...

- భారత్- హైదరాబాద్ సూర్యోదయాన్ని 16సార్లు చూశా
- యాక్సియం- 4 మిషన్ అనుభూతిని వివరించిన శుభాంశు శుక్లా



న్యూఢిల్లీ : అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి భారత్ చాలా అందంగా కనిపించిందని భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా చెప్పారు. ప్రపంచంలోని ప్రత్యేక స్థానంలో, విశిష్ట ఆకారంలో ఉన్నందు వల్లే మన దేశం అలా కనిపించి ఉండొచ్చన్నారు. తాను భారతీయుడిని అయినందున ఈ మాట చెప్పడం లేదని, ఐఎస్ఎస్‌లోని ఏ వ్యోమగామిని అడిగినా ఈ విషయాన్నే చెబుతారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకించి రాత్రి టైంలో హిందూ మహాసముద్ర మార్గంలో దక్షిణ దిశ నుంచి ఉత్తర దిశకు ఐఎస్ఎస్ వెళ్లేటప్పుడు, భారత్ చాలా అద్భుతంగా కనిపిస్తుందన్నారు.

గగన్‌యాన్ మిషన్ కోసం ఎంపికైన నలుగురు గగన్ యాత్రీలను సత్కరించేందుకు భారత వాయుసేన (ఐఏఎఫ్) ఆదివారం న్యూఢిల్లీలోని సుబ్రతో పార్క్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈసందర్భంగా నలుగురు గగన్ యాత్రీలు శుభాంశు శుక్లా (గ్రూప్ కెప్టెన్), పీవీ నాయర్ (గ్రూప్ కెప్టెన్), అజిత్ క్రిష్ణన్ (గ్రూప్ కెప్టెన్), అంగద్ ప్రతాప్ (గ్రూప్ కెప్టెన్)లను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సన్మానించారు.

మిగతాది 3వ పేజీలో

## లైఫ్ సైన్సెస్ కు తెలంగాణ కేంద్రం - సీఎం రేవంత్



హైదరాబాద్‌లో జరిగిన బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణను లైఫ్ సైన్సెస్ రంగానికి కేంద్రంగా మారుస్తామని ఆయన అన్నారు. "దేవుడు గొప్ప డిజైనర్, ప్రకృతి ఉత్తమ గురువు. మనం మంచి విద్యార్థులమా కాదా అన్నదే ప్రశ్న" అని వ్యాఖ్యానించారు. తెలంగాణ రైజింగ్ 2047 అనే కొత్త ప్రయాణాన్ని ప్రారంభించామని, అప్పటికి రాష్ట్రాన్ని %వి%3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

లైఫ్ సైన్సెస్ రంగంలో ఆవిష్కరణలు చేయడానికి తెలంగాణ సరైన వేదిక అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిశోధన, అభివృద్ధి వనరులు, మౌలిక సదుపాయాలు ఈ రంగానికి ప్రోత్సాహాన్ని ఇస్తాయని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణలో లైఫ్ సైన్సెస్ రంగానికి మరింత ఊతమిస్తాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ సమ్మిట్‌లో పాల్గొన్న దేశ, విదేశీ ప్రతినిధులు ముఖ్యమంత్రి వ్యాఖ్యలను స్వాగతించారు. తెలంగాణలో లైఫ్ సైన్సెస్ రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని, మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉక్రెయిన్‌తో ఒప్పందం కుదుర్చుకోకుంటే ఆంక్షలే

### రష్యాకు ట్రంప్ బెదిరింపు



వాషింగ్టన్ : ఉక్రెయిన్ విషయంలో రెండు వారాల్లో శాంతియుత పరిష్కారం దిశగా పురోగతి కన్పించని పక్షంలో రష్యాపై ఆంక్షలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరించారు. వారం రోజుల క్రితం అలస్కాలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమైన తర్వాత కూడా సమస్య పరిష్కారంలో ముందడుగు పడకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. 'ఏం చేయాలనే విషయంపై నిర్ణయం తీసుకోబోతున్నాను. అది చాలా ముఖ్యమైన నిర్ణయం. పెద్ద ఎత్తున ఆంక్షలా లేక పెద్ద ఎత్తున సుంకాలా లేక రెండూ విధించాలా లేకుంటే ఇది మీ యుద్ధం%ో% మేము చెప్పేదేమీ లేదని అనాలా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది' అని ట్రంప్ శుక్రవారం చెప్పారు. తనకు, పుతిన్‌కు మధ్య సమావేశం జరగకుండా చూడడానికి రష్యా అన్ని ప్రయత్నాలూ చేస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. యుద్ధాన్ని ఎలా ఆపాలనే విషయంపై చర్చించేందుకు సమావేశం జరగాల్సి ఉన్నదని జెలెన్‌స్కీ అన్నారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రట్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'యుద్ధాన్ని ఆపేయాలని వారు కోరుకోవడం లేదు. అందుకే సమావేశం జరగకుండా చూస్తున్నారు' అని చెప్పారు. సమావేశం అజెండా ఇంకా సిద్ధం కాలేదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గరు లవ్‌రావ్ చెప్పారు. అలస్కా భేటీలో ట్రంప్ ప్రతిపాదించిన అంశాలపై వట్టువిడుపులు ప్రదర్శించడానికి రష్యా సిద్ధంగా ఉన్నదని తెలిపారు. పుతిన్-జెలెన్‌స్కీ మధ్య సమావేశాన్ని ఇంకా ఖరారు చేయలేదని, అజెండాను ఖరారు చేసిన తర్వాత చర్చలకు పుతిన్ సిద్ధంగానే ఉంటారని అన్నారు.

## అంతరిక్షం వెళ్లిన తొలి వ్యక్తి హనుమాన్

### బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్..

### ట్రోల్స్ చేస్తున్న నెటిజన్లు




మండీ. అంతరిక్షంలోకి వెళ్లిన తొలి వ్యక్తి హనుమాన్ అని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదానికి దారి తీశాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనా జిల్లాలో ఓ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అనురాగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. అంతరిక్షంలోకి వెళ్ళిన మొదటి వ్యక్తి ఎవరు? అని ప్రశ్నించాడు. దీనికి విద్యార్థులందరూ "నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్" అని సమాధానమిచ్చారు.

అయితే పిల్లలిచ్చిన సమాధానాన్ని ఠాకూర్ ఖండిస్తూ.. నాకు తెలిసి అంతరిక్ష యాత్ర చేసిన తొలి వ్యక్తి హనుమాన్ జీ అంటూ చెప్పుకోచ్చాడు. దీంతో విద్యార్థులందరూ ఒక్కసారిగా షాక్ తిన్నారు. అంతేగాకుండా ఠాకుర్ మాట్లాడుతూ.. మనకు వేల సంవత్సరాల నాటి మన సంప్రదాయం, జ్ఞానం, సంస్కృతి తెలియకపోతే, ఆంగ్లేయులు మనకు చూపించినదే మనం చూస్తాం అందుకే పురాణల గురించి కూడా తెలుసుకోండి అంటూ ఠాకుర్ తెలిపాడు. అనంతరం, ఉపాధ్యాయులను ఉద్దేశించి.. పాఠ్యపుస్తకాలకు మాత్రమే పరిమితం కాకుండా, మన వేదాలు, సంప్రదాయాలు, జ్ఞానం వైపు దృష్టి సారిస్తే మనకు చాలా విషయాలు తెలుస్తాయి అని సూచించారు. అయితే ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో, అనురాగ్ ఠాకూర్ పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మిగతాది 3వ పేజీలో

## దేశ ప్రజల సమస్యలను లేవనెత్తడానికి సభ వేదిక కావాలి

- ప్రజాస్వామ్యబద్ధంగా దేశాన్ని నడపడం ముఖ్యం
- అఖిల భారత స్పీకర్ల సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ బ్యూరో : దేశ ప్రజల సమస్యలను లేవనెత్తడానికి సభ నిష్పాక్షికమైన వేదిక కావాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. దేశాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా నడపడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. కేంద్ర శాసనసభ మొదటి స్పీకరుగా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికై శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఢిల్లీ అసెంబ్లీలో రెండు రోజులపాటు నిర్వహించే అఖిల భారత స్పీకర్ల సమావేశాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. దేశ స్వేచ్ఛ ఎంత ముఖ్యమో, స్వాతంత్ర్యం తరువాత దేశాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా నడపడం కూడా అంతే ముఖ్యమని నొక్కి చెప్పారు. భారతీయ ఆలోచనల ఆధారంగా దేశాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా నడపడానికి పునాది వేసే పని విఠల్‌భాయ్ పటేల్ చేశారని ఆయన అన్నారు. సభ గౌరవాన్ని, స్పీకరు పదవి గౌరవాన్ని పెంపొందించడానికి కృషి చేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు. దేశ ప్రజల సమస్యలను లేవనెత్తడానికి సభ నిష్పాక్షికమైన వేదికను అందించాలని ఆయన అన్నారు. నిబంధనల ప్రకారం సభ సక్రమంగా జరిగేలా చూసుకోవడం ప్రతి సభ్యుని బాధ్యతని పేర్కొన్నారు. సభల్లో ప్రభుత్వం, ప్రతిపక్షాలు నిష్పాక్షిక వాదన చేయాలని అన్నారు. 'స్వర్ణ చరిత్రను సృష్టించిన, స్వర్ణ భవిష్యత్తు కోసం పనిచేస్తున్న మొత్తం శాసన వ్యవస్థ ఈ చారిత్రాత్మక సభలో ఉంది' అని అమిత్ షా అన్నారు. దేశ సుదీర్ఘ చరిత్రలో అసెంబ్లీలు తమ గౌరవాన్ని కోల్పోయినప్పుడల్లా, మనం భయంకరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

మిగతాది 3వ పేజీలో

## రెండు కొత్త వైమానిక రక్షణ క్షిపణుల ప్రయోగం



ఇరుదేశాల సరిహద్దుల్లో మంగళవారం ఉత్తర కొరియా సైనికులపై హెచ్చరిక కాల్పులు జరిపినట్లు దక్షిణ కొరియా సైన్యం శనివారం తెలిపింది. ఈ ఘటన ముందస్తు ప్రణాళిక మరియు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్య అని ఉత్తర కొరియా ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ కో జోంగ్ చెల్ పేర్కొన్నారు. ఇది చాలా తీవ్రమైన చర్య అని, దక్షిణ సరిహద్దు ప్రాంతంలో పరిస్థితిని అనివార్యంగా నియంత్రించలేదని దశకు తీసుకువెళుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ భారీ సంఖ్యలో దళాలు ఘర్షణ పడుతున్నాయని అన్నారు.

## ట్రోల్స్ చేస్తున్న నెటిజన్లు

ఒక నెటిజన్ రాసుకోస్తూ.. ఇలాంటి నాయకులు భారతదేశాన్ని వేల సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారా? కనీసం పాఠశాల పిల్లలకు తప్పుడు జ్ఞానం చెప్పకూడదని అనే విషయం తెలియదా? అని కామెంట్ చేశారు. మరో నెటిజన్ కామెంట్ చేస్తూ.. పదవీలో ఉన్న మంత్రులు చదువు, శాస్త్రాలను పక్కనపెట్టి కథలను సైన్స్ గా చెబితే పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. చరిత్ర, పౌరాణిక కథలను గౌరవించడం సరైనదే, కానీ విద్యలో నిజం, విజ్ఞానం మాత్రమే ఉండాలి అంటూ రాసుకోచ్చాడు. ఇక అంతరిక్షంలోకి మొట్టమొదటగా వెళ్లిన వ్యక్తి సోవియాట్‌కి చెందిన యూరి గగారిన్ కాగా.. చంద్రుడిపై మొట్టమొదటగా కాలు మోపింది నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్.

## అంతరిక్షం నుంచి ఎంతో అందంగా

ఈ సందర్భంగా శుభాంశు శుక్లా మాట్లాడుతూ, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో తాను చవిచూసిన అనుభూతి గురించి వివరించారు. అక్కడి నుంచి తాను రికార్డ్ చేసిన భారతదేశం వీడియోను చూపిస్తూ, భూమి ఎగువ వాతావరణంలో ఆక్సిజన్ ఆకుపచ్చ కాంతి, నక్షత్రమయ ఆకాశం ఉన్నాయన్నారు. హైదరాబాద్, బెంగళూరు నగరాలను శుభాంశు శుక్లా ప్రస్తావిస్తూ, ఈ రెండు నగరాల్లో సూర్యోదయం కావడాన్ని ఐఎస్ఎస్‌లోని వ్యోమగాములు రోజూ స్పష్టంగా చూడగలుగుతారని చెప్పారు. ఈ గొప్ప సీన్‌ను వ్యోమగాములు ఒక రోజులో ఏకంగా 16 సార్లు చూడగలుగుతారని, అయినా ఏ ఒక్కసారి కూడా బోర్ కొట్టదన్నారు. కొన్ని నెలల క్రితమే అమెరికాకు చెందిన యాక్సియం- 4 మిషన్ ద్వారా శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కు వెళ్లచ్చారు. అక్కడ ఎదురైన అనుభూతిని తెలిపే క్రమంలో ఆయన ఈవివరాలను వెల్లడించారు. రాకేశ్ శర్మ అంతరిక్ష యాత్ర గురించి చిన్నప్పుడు కథలు మాత్రం వినేవాడిని. అటువంటి నన్ను భారత వాయుసేన ఈ స్థాయికి తీసుకొచ్చిందని శుక్లా చెప్పారు. నాలో ఈ గొప్ప మార్పునకు వాయుసేనే కారణం. విమానంలోని కాక్‌పిట్ నా గొప్ప గురువు. ఈ యూనిఫామ్‌కు నేను రుణపడి ఉంటాను. భారత వాయుసేనకు నా ధన్యవాదాలు. ఇక్కడ కూర్చున్న వాళ్లంతా తమతమ స్థాయిల్లో చక్కగా విధులను నిర్వర్తించి ఉంటారు. నేనూ అలాగే ఫీలవుతాను. ఏ బాధ్యతను అప్పగించినా చక్కగా నిర్వర్తిస్తాను. ఎయిర్‌ఫోర్స్‌లో చేరే ప్రతీ ఒక్కరికి ఇదే విధమైన బాధ్యతాయుత ప్రవర్తన అలవడుతుంది" అని వ్యోమగామి శుభాంశు శుక్లా చెప్పారు.

గగన్ యాత్రీలను చూసి భారత్ గర్విస్తోంది : రాజ్‌నాథ్

గగన్ యాన్ మిషన్‌కు వెళ్లనున్న నలుగురు గగన్ యాత్రీలు భారతదేశానికే గర్వకారణమని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. ఇందుకోసం వారు చాలా కఠినమైన శిక్షణను పొందారని చెప్పారు. అంతరిక్ష అన్వేషణలో భారత్ పెట్టుకున్న లక్ష్యాల సాకారంలో ఈ గగన్ యాత్రీలు కీలక పాత్ర పోషించబోతున్నారని ఆయన తెలిపారు. గగన్ యాత్రీల టీమ్‌లోని శుభాంశు శుక్లా, పీవీ నాయర్, అజిత్ క్రిష్ణన్, అంగద్ ప్రతాప్ భారతమాత ముద్దుబిడ్డలని, వారిని చూసి గర్విస్తున్నామని రాజ్‌నాథ్ చెప్పారు.

## కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



రాష్ట్రంలో మంచి చేసే కూటమి ప్రభుత్వంను అన్ని తరగతుల ప్రజలు ఆశీర్వదించాలని, జరిగిన మేలును పదిమందికి చెప్పాలని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. సిఎం చంద్రబాబు మానవత్వంతో పేదలకు వైద్య ఖర్చులు అందించాలనే ఉద్ధేశ్యంతోనే సిఎం సహాయ నిధిని పునరుద్ధరించారన్నారు. పాలకొల్లులో ఆదివారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గంలో పేదలకు వైద్య ఖర్చు నిమిత్తం సిఎం సహాయనిధిని 31 మందికి రూ.20 లక్షల చెక్కులను అందజేశారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నాడు జగన్ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధులను సైతం పక్కదోవ పట్టించి పేదలకు వైద్యాన్ని పూర్తిగా దూరం చేశాడన్నారు. పేదలకు వైద్య సాయం అందించలేక మానవత్వాన్ని మరిచిన వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలోనే ఏడాది కాలంలో 6 కోట్లు 50 లక్షలు వరకు అందించామన్నారు. వారం వారం పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి సహాయంగా వైద్యానికి సాయం అందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి తరగతుల ప్రజల వైద్య ఖర్చులకు సిఎంఆర్ఎఫ్ సాయం కోసం ఒకసారి దరఖాస్తు చేసుకుంటే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మంజూరైన తర్వాత పిలిచి ఇస్తున్నామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో వైసిపి నాయకులకు దరఖాస్తు చేసుకుంటే డ్రెయిన్లు, కాలువల వెంబడి పడవేసే వారని ఆ పార్టీ నాయకుడు దరఖాస్తు చేసుకుంటేనే దిక్కు లేదన్నారు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ చంద్రబాబు ఫొటోలు ఇంట్లో పెట్టుకుని ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, క్షేమంగా, సంతోషంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సమస్యలను విస్మరించిన చంద్రబాబు

ఏలేరు ఆధునికీకరణ ఊసెత్తని వైనంనిరాశ పరిచిన సిఎం పర్యటన కాకినాడ ప్రతినిధి, సామర్లకోటపెద్దాపురంలో శనివారం నిర్వహించిన సిఎం పర్యటన జిల్లా ప్రజలను నిరుత్సాహ పరిచింది. ఈ పర్యటనలో ప్రజా సమస్యల ప్రస్తావన ఎక్కడా రాలేదు. కనీసం జిల్లా ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపైనా ఆయన పెదవి విప్పలేదు. ఏలేరు ఆధునికీకరణ, సుద్ధగడ్డ కాలువ పనులు, అతివృష్టి, అనావృష్టికి అన్నదాతలకు కలిగిన నష్టపరిహారం వంటి ప్రస్తావనలు ఎక్కడా లేవు. కాకినాడ స్మార్ట్ సిటీ ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు, సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటు వంటి దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించిన జిల్లా వాసులకు అసంతృప్తే మిగిలింది. ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి ఏడాదిన్నరలో రెండోసారి చంద్రబాబు జిల్లాలో అధికారికంగా పర్యటించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, ప్రజా వేదిక కార్యక్రమాల్లో ఆయన ప్రసంగించారు. అనంతరం జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. పి4లో భాగంగా ఎంపిక చేసిన బంగారు కుటుం బాలను మార్గదర్శకులకు అప్పగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సుమారు గంట ప్రసంగంలో ముఖ్యమంత్రి పూర్తిగా సూపర్ సిక్స్, పి4, రూ.330 కోట్లతో వేస్ట్ ఎనర్జీ విధానం వంటి అంశాలకే ప్రాధాన్యతనిచ్చారు.ఏలేరు ఆధునికీకరణ మాట మరిచారుఏలేరు ఆధునికీకరణ లేకపోవడంతో ఈ జిల్లాలో 5 మండలాలకు చెందిన సుమారు 50 వేల మంది రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వరదల కారణంగా కాలువలు గండ్లు పడి పంటలను ముంచెత్తుతున్నాయి. అధ్వానంగా ఉన్న కాలువలను తాత్కాలిక పద్ధతిలో క్లోజర్ పనులు చేసినప్పటికీ అన్నదాతలకు అక్కరకు రాకుండా పోతున్నాయి. ఈ నేపథ్యంలో ఏలేరు ఆధునీకరణకు నిధులను కేటాయించాల్సి ఉంది. గతేడాది సెప్టెంబర్‌లో చంద్రబాబు మొదటిసారి ఈ జిల్లాకు వచ్చారు. స్వయంగా ఏలేరు రైతుల కష్టాలను వరద ప్రభావిత ప్రాంతాల్లో తిరిగి చూశారు. ఆ సందర్భంలో రైతాంగాన్ని ఆదుకుంటామంటూ హామీలు ఇచ్చారు. కానీ అధికారం చేపట్టి ఏడాదిన్నర కావొస్తున్నా ఈ ప్రాజెక్టు ఆధునీకరణ ఊసెత్తలేదు, పెద్దాపురం సభలోనైనా ఆధునీకరణ కోసం మాట్లాడతారని రైతులంతా ఎదురు చూశారు. కానీ చంద్రబాబు ప్రసంగం నిరాశ పరచడంతో వారు పెదవి విరిచారు. సుద్ధగడ్డ కాలువ విషయంలోనూ ఇలాగే వ్యవహరించారు. సంపద సృష్టి కోసం మాట్లాడారు కాని సెస్‌లో పరిశ్రమల స్థాపనపై పెదవి విప్పలేదు. పెద్దాపురానికి పాత హామీలే%ా%2014 నుంచి 19 వరకు పాలించిన టిడిపి హయాంలో పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప హెూమ్ మంత్రిగా ఉన్నారు. అప్పట్లో ఆయన పెద్దాపురం సిహెచ్‌సిగా సేవలందిస్తున్న ఆసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తాజాగా మరోసారి 100 పడకల ఆసుపత్రి ప్రతిపాదనను ఎంఎల్ఎ రాజప్ప చంద్రబాబు ముందు ఉంచారు. దీంతో ఆయన ప్రైవేటు భాగస్వామ్యంతో ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సభలో మరోసారి హామీ ఇచ్చారు. పెద్దాపురం, సామర్లకోట పట్టణాలకు రూ.75 కోట్లతో ప్రజలకు ఇంటింటా కుళాయిల ఏర్పాటు ద్వారా రక్షిత త్రాగునీరు అందించేందుకు కృషి చేస్తామని చంద్రబాబు తెలిపారు. సామర్లకోటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు.పారిశుధ్య కార్మికులకు కొత్త పథకంమున్సిపల్ కార్మికులు, వారి కుటుంబాలకు సంక్షేమం, భద్రత అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. పెద్దాపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రమాద, ఆరోగ్య బీమా స్కీమును ప్రారంభించారు. పట్టణాభివృద్ధి శాఖ, యాక్సిస్ బ్యాంక్ సంయుక్తంగా ఈ స్కీమును అమలు చేసేలా ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఇప్పటికే మున్సిపల్ కార్మికుల శాలరీ ప్యాకేజ్ ఖాతాలు ప్రారంభించారు. ఈ కొత్త ఆర్థిక సదుపాయం ద్వారా మున్సిపల్ కార్మికులకు గణనీయమైన భరోసా లభించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 123 అర్బన్ లోకల్ బాడీస్‌లో మొత్తం 55,686 మంది కార్మికులు సేవలందిస్తున్నారు. ఇప్పుడు ఈ స్కీమ్ ద్వారా




వీరందరికీ ఈ బీమా సదుపాయం లభించనుంది. వీరిలో 39,170 మంది పబ్లిక్ హెల్త్ విభాగంలో ఉండగా, 16,516 మంది ఇతర విభాగాల్లో పని చేస్తున్నారు. వీరిలో శాశ్వత, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న వారందరికీ ఈ పథకం వర్తించనుంది. ఇప్పుడు యాక్సిస్ బ్యాంక్‌తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ద్వారా ఈ ప్రయోజనాలు మరింత విస్తరించాయి. శాశ్వత ఉద్యోగులకు ఒక రూ.1 కోటి వరకు ప్రమాద బీమా, రూ.పది లక్షల లైఫ్ కవర్ లభించనుంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.20 లక్షల ప్రమాద బీమా, రూ.2 లక్షల లైఫ్ కవర్ సదుపాయం ఉంటుంది. కుటుంబ సభ్యులతో కలిపి మొత్తంగా రూ. 33 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు వైవివి.సత్యనారాయణ, ఎం.దుర్గలను సిఎం సత్కరించారు.సిఎం చంద్రబాబుకు ఘన స్వాగతం ముఖ్యమంత్రి చంద్రబాబుకు హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, పి.నారాయణ, కార్మిక శాఖ మంత్రి వి.సుభాష్, ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, ఎంపీలు సానా సతీష్‌బాబు, తంగెళ్ల ఉదరు శ్రీనివాస్, జిల్లా ప్రత్యేకాధికారి జి.వీరపాండ్యన్, కలెక్టర్ షన్‌మోహన్ సగిలి, ఎస్‌పి జి.బిందుమాధవ్, ఎంఎల్ఎలు యనమల దివ్య, డి.సుబ్బరాజు, జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, వి.సత్యప్రభ, పంతం నానాజీ, ఎన్.రామకృష్ణారెడ్డి, ఎంఎల్‌సి పి.రాజశేఖర్, కర్రి పద్మశ్రీ ఉన్నారు.

# ఉమ్మడి 'అనంత'లో ముందుకుసాగని ఖరీఫ్



అనంతపురం ప్రతినిధి : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖరీఫ్ సీజన్ ముగియడానికి వస్తున్నా ఇప్పటికీ 60 శాతం భూమిలో విత్తనం పడలేదు. 10.4 లక్షల ఎకరాలు బీడుగా ఉంది. 17.33 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ మొదట అంచనా వేసింది. ఈ మేరకు అనంతపురం జిల్లాలో 9.78 లక్షల ఎకరాలయితే విత్తనం పడింది 5.07 లక్షల ఎకరాల్లో. 60 శాతం సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో 7.55 లక్షల ఎకరాలకుగానూ విత్తనం పడింది కేవలం 1.86 లక్షల ఎకరాల్లోనే అంటే సాధారణ సాగులో 34 శాతమే పంటలు సాగయ్యాయి. కీలకమైన జూన్, జులై నెలల్లో వర్షాలు లేకపోవడంతో రైతులు విత్తనం వేసుకోలేకపోయారు. ఆగస్టు మాసంలో మంచి వర్షాలొచ్చినప్పటికీ ప్రధాన పంట అయిన వేరుశనగ సాగుకు అదును దాటిపోయింది. దీంతో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా సాగలేదు. అయితే ప్రభుత్వం సమయముందున్న ఉద్దేశంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. ప్రత్యామ్నాయ విత్తనాల్లేకపోవడంతో ఇతర పంటల సాగు కూడా అంతంత మాత్రంగానే సాగింది.

### గణనీయంగా తగ్గిన వేరుశనగ సాగు

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ సాగు గణనీయంగా తగ్గింది. అనంతపురం జిల్లాలో 4.49 లక్షల ఎకరాలయితే సాగైంది కేవలం 1.71 లక్షల ఎకరాల్లోనే సాగైంది. సాధారణంలో 38 శాతమే సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో 3.75 లక్షల ఎకరాలు సాధారణ సాగయితే లక్ష ఎకరాల్లోనే విత్తనం వేశారు. 27 శాతమే అయింది. ఇక కంది పంట అయితే సాధారణం కంటే గణనీయంగా పెరిగింది. కంది అనంతపురం జిల్లాలో 1.36 లక్షల ఎకరాలయితే 1.93 లక్షల ఎకరాలయింది. సాధారణం కంటే 142 శాతం అధికమైంది. సత్యసాయి జిల్లాలో 71 వేల ఎకరాలయితే 52 వేల ఎకరాల్లో సాగైంది. సజ్జ పంట అనంతపురం జిల్లాలో సాధారణ సాగు 5075కు గానూ 7583 ఎకరాల్లో 149 శాతం సాగైంది. సత్యసాయి జిల్లాలో రెండు ఎకరాలకుగానూ 1341 ఎకరాల్లో అయింది. పత్తి, వరి ఇతర పంటలు కూడా సాధారణం కంటే తక్కువగానే సాగయ్యాయి.

### అదునులో ప్రత్యామ్నాయం కరువు

ఖరీఫ్ సీజన్‌లో కీలకమైన జూన్, జులై నెలల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఆగస్టులో అధిక వర్షాలు నమోదయ్యాయి. కరువు మండలాల ప్రకటన జరగాలంటే ఆగస్టు ఆఖరు వరకు సీజన్‌ను చూసి ఇవ్వడం జరుగుతుంది. ఆ తరువాత కూడా వర్షాభావం ఉంటేనే కరువు పరిస్థితులు వచ్చినట్టు భావిస్తారు. ఆగస్టులో పెద్దఎత్తున ఉమ్మడి జిల్లాలో వర్షపాతం నమోదయింది. మొదటి రెండు నెలలు పడలేదు. రెండు నెలలు పడకపోవడంతో అదునులో పదునులేక రైతులు విత్తనం విత్తుకోలేకపోయారు. ఆగస్టులో వేసినా పెద్దగా పంటరాదన్న ఉద్దేశ్యంతో రైతులు ప్రధాన పంట వేరుశనగను సాగు చేయలేకపోయారు. దీంతో ఎప్పుడూలేనంత తక్కువగా వేరుశనగ ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో పడిపోయింది. ఇక ప్రత్యామ్నాయ విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిఉంటే ఆగస్టులో పడుతున్న వర్షాలతోనైనా పంటలు సాగుచేసుకునేందుకు వీలుండేదని రైతులు వాపోతున్నారు.

# ఆక్వా నెత్తిన ట్రంప్ సమ్మెట

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకం బూచి చూపి ఎగుమతి దారులు, కంపెనీలు రొయ్యల ధరలను అమాంతం తగ్గించడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని తీర ప్రాంత మండలాల్లో వనామీ రొయ్యల సాగు అధికంగా సాగు అవుతోంది. ప్రస్తుతం మొదటి పంట పూర్తయి, రెండో పంటకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 85 వేల ఎకరాల్లో సాగు..ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చేపలు, రొయ్యలు 2.80 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీనిలో 80 వేల ఎకరాల్లో రొయ్య పంట సాగులో ఉంది. అధికంగా కోనసీమ జిల్లాలో 45 వేల ఎకరాల వరకు సాగులో ఉండగా, మిగిలిన భాగం కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఉంది.మరో మూడు నెలల్లో పంట చేతికి..మరో రెండు మూడు నెలల్లో రైతుల వద్ద పంట ఉంటుంది. ఇటువంటి తరుణంలో తాజాగా అమెరికా సుంకాల దెబ్బ ఎంతవరకు ఉంటుందనే ఆవేదన రైతుల్లో వ్యక్తం అవుతోంది. మార్చి నెలలో రోజుకు రూ.10 చొప్పున ధర పడిపోవడంతో రైతులు మానసిక ఆవేదనకు గురయ్యారు. ప్రస్తుతం వంద కౌంట్రూ .240ల వరకు కొంటున్నారు. రైతుల వద్ద పంట చేతికి వచ్చే సమయంలో సుంకాలు అమలు చేస్తే తిరిగి గతంలో మాదిరిగానే వంద కౌంట్ ధర రూ.200లకు పడిపోయే అవకాశం ఉందని అధికారులు ట్రేడ్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. దీంతో రైతులు పెట్టుబడి రాని పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల క్రితం వనామీ 100 కౌంట్ ధర రూ.270 ఉండగా ప్రస్తుతం రూ.225కు తగ్గింది. టైగర్ రొయ్య 20 కౌంట్ ధర నెల రోజుల క్రితం రూ.680 ఉండగా ప్రస్తుతం 570కి తగ్గింది. ఈ లెక్కన నెల రోజుల్లో వనామీ ధర రూ.45, టైగర్ ధర రూ.100 తగ్గింది. దీనివల్ల లాభాల సంగతి దేవుడెరుగు పెట్టుబడులు వచ్చే పరిస్థితి కన్పించడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.డాలర్ పంట దమాల్%ా%!డాలర్ పంటగా పేరొందిన ఆక్వా సాగుకు కొన్నాళ్లుగా గడ్డుకాలం ఎదురైంది. పెరుగుతున్న లీజులు, చేయి దాటుతున్న పెట్టుబడులు, దిగజారుతున్న ధరలు, ఆకాశాన్ని అంటుతున్న దాణా, మందుల ధరలు, చుట్టుముడుతున్న వ్యాధులు ఆక్వా రైతులపై మూకుమ్మడి దాడి చేస్తున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు డ్రొనాల్ట్ ట్రంప్ సుంకాల దెబ్బకు ఆక్వా రంగం మరింత పడిపోయింది. ఎగుమతులు నిలిచిపోవటంతో ధరలు రోజురోజుకు పతనమైపోతున్నాయి. చేతికొచ్చిన పంటను నిల్వ చేయలేని స్థితి. తక్కువ ధరకు అమ్ముకుంటే కష్టానికి కనీసం ప్రతిఫలం కూడా రాని పరిస్థితి నెలకొంది. 15 ఏళ్ల కిందట వరకు రొయ్యల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించేవారు. ఎకరా చెరువులో 30-40 వేల మధ్య పిల్లలను వేసేవారు. ఏరియేటర్లకు డీజిల్ ఇంజిన్లు వినియోగించేవారు. మేత ధరలు టన్ను రూ.30-40 వేల మధ్య ఉండేది. లీజులు ఎకరాకు రూ.20-40 వేల మధ్య ఉండేది. వ్యాధుల బాధ తక్కువగా ఉండేది. దీంతో సులభంగా 30-40 కౌంట్‌లు వచ్చేవి. అప్పట్లో 40 కౌంట్ ధరలు రూ.400 వరకు ఉండటంతో రైతులకు లాభాల పంట పండేది. ప్రస్తుతం ఎకరాకు 1.50 లక్షల పిల్లలను వదులుతున్నారు. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, బిల్లులు అధికంగా అవుతున్నాయి. టన్ను మేత ధర రూ.80 వేలు అయింది. ఇంక చెరువుల్లో వదిలే రొయ్య పిల్లల సంఖ్య 3 రెట్లకు పెరగడంతో అదే రీతిలో మేత వేయాల్సి వస్తోంది. దీంతో ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. లీజు ఎకరాకు రూ.1.50 లక్షల వరకు చేరింది. ఇంక వ్యాధుల సంగతి అయితే చెప్పనవసరం లేదు.పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు..!ఏప్రిల్ 3న అమెరికా పన్నుల పెంపు ప్రకటనను సాకుగా చూపించి కిలోకు 30 కౌంట్‌కు రూ.460, 40 కౌంట్కు రూ.370, 100 కౌంట్కు రూ.230 ఉన్న ధరలను ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్వాహకులు, ఎక్స్‌పోర్టర్స్, వ్యాపారులు రూ.30 నుంచి రూ.70 వరకు తగ్గించేశారు. రొయ్యల సాగు పెట్టుబడులు ఏడాది కేడాదికి పెరుగుతున్నాయి. విద్యుత్ బిల్లులు రెట్టింపవగా, జీవ రసాయన మందుల ధరలు అయాంతం పెరిగాయి. పెరిగిన వర్కర్స్ జీతాలు దీనికి తోడయ్యాయి. దీంతో ఎకరం రొయ్యల సాగుకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల ఖర్చవుతోంది. ఈ లెక్కన పెట్టుబడులు రావాలంటే వనామీ 100 కౌంట్ కౌలు రైతు అయితే రూ.250 అమ్మాలి. సొంత రైతు అయితే రూ.225 అమ్మాలి. కానీ ప్రస్తుతం ధరలు అంతకు మించి తగ్గాయి. ఎకరాకు రూ.లక్షపైనే నష్టం..!రొయ్యల ఉత్పత్తి బాగా ఉంటే ఎకరానికి 2 టన్నులు దిగుబడి ఉంటుంది.



ప్రస్తుతం సగటున ఎకరానికి 1.50 టన్నులకు మించి దిగుబడి రావడం లేదు. ఈ లెక్కన ఉన్న ధరతో ఎకరాకు రూ.3.50 లక్షలకు మించి రాబడి ఉండడం లేదు. దీంతో ఎకరాకు సొంత రైతుకు రూ.లక్షకు తగ్గకుండా, కౌలు రైతు రూ. 1.50 లక్షల నుంచి 2 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తోంది. ఎకరం కౌలు చెరువులను బట్టి రూ. 50 వేల నుంచి రూ. 1లక్ష ఉంది. కౌలు రైతులకు వడ్డీలు అదనపు భారంగా మారనున్నాయి. పరిశ్రమపై ప్రభావంఈ సంక్షోభం కేవలం రైతులకే పరిమితం కాలేదు. దీని ప్రభావం మొత్తం సరఫరా గొలుసుపై పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 100-150 ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు, ముఖ్యంగా విశాఖ పరిసర ప్రాంతాల్లోని 15 ఫ్యాక్టరీలు ఎగుమతి ఆర్డర్లు లేక ఉత్పత్తిని భారీగా తగ్గించాయి. దీని వల్ల వేలాది మంది కార్మికులు, ముఖ్యంగా మహిళలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.ట్రంప్ సుంకాల బూచి చూపి..అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల బూచి చూపి ఎగుమతి దారులు, కంపెనీలు రైతులను నిలువునా ముంచుతున్నాయి. వాస్తవానికి 100 కౌంట్ రొయ్య అమెరికాకు వెళ్లదు. కేవలం 20, 30, 40, 50 కౌంట్ రొయ్యలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. అమెరికాకు రొయ్య ఎగుమతి కాకుండానే ఎగుమతిదారులు, వ్యాపారులు ట్రంప్ సుంకాల పేరుతో ఇబ్బడి ముబ్బడిగా ధరలు తగ్గించి రొయ్య రైతును దోపిడీ చేస్తున్నారు.'కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమెరికాతో దౌత్య, వాణిజ్యపరమైన చర్చలు జరిపి, సుంకాలను తగ్గించేలా లేదా పూర్తిగా తొలగించేలా ఒత్తిడి తీసుకురావాలి. నష్టపోయిన రైతులకు తక్షణమే ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలి. విద్యుత్, రొయ్యల మేత వంటి కీలకమైన వాటిపై సబ్సిడీలను పెంచి, సాగు వ్యయాన్ని తగ్గించాలని రైతులు కోరుతున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే.. రాబోయే సీజన్‌లో రొయ్యల సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరిశ్రమ భవిష్యత్తును మరింత ప్రమాదంలోకి నెడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

SAI BALAJI DIGITALS PVT LTD

# ఉద్యోగ విరమణ అభినందన సన్మాన మహోత్సవ ఆత్మీయ ఆహ్వానము

36 సం॥రాల నిరంతర సేవా తత్పరులు, స్నేహశీలి, మృదుస్వభావి, సహృదయశీలి

## శ్రీమతి వంగోలు శాంతి కుమారి

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ZPHS-ఇబ్రహీంపూర్, జి॥ జనగామ.

## ఉద్యోగ విరమణ వీడ్కోలు అభినందన సభ



తేది : 29-08-2025 ఉదయం గం॥ 11-00 ని.లకు

స్థలం : సాయిరాం కన్వెన్షన్ హాల్, హైద్రాబాద్ రోడ్, జనగామ.

సమావేశ అధ్యక్షులు : శ్రీ చాడా గణేష్ రెడ్డి గారు, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు

ముఖ్య అతిథి : శ్రీ పర్మార్ పింకేష్‌కుమార్ లలిత్ కుమార్ గారు, జిల్లా విద్యాశాఖాధికారి, అడిషినల్ కలెక్టర్, జనగామ.

విశిష్ట అతిథి : శ్రీ చావా రవి గారు, TSUTF రాష్ట్ర అధ్యక్షులు

ప్రత్యేక అతిథులు : శ్రీమతి డా॥ జి.ఉషారాణి గారు, డైరెక్టర్, అడల్ట్ ఎడ్యుకేషన్, తెలంగాణ, స్పెషల్ ఆఫీసర్, జనగామ జిల్లా

శ్రీ దర్శనం బోజన్న గారు, FAO, DEO కార్యాలయం

శ్రీ పాకనాటి రఘునందన్ రెడ్డి గారు, MEO, రఘునాథపల్లి.

శ్రీ చీటకోడూరు ఆనంద్ కుమార్ గారు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు

శ్రీమతి అంబీరు అరుణ గారు, AAPC చైర్‌పర్సన్

అతిథులు : శ్రీ కాసుగంటి రంజిత్ కుమార్ గారు, TSUTF రాష్ట్ర కార్యదర్శి

శ్రీ ఆకుల శ్రీనివాసరావు గారు, TSUTF, FWF రాష్ట్ర డైరెక్టర్

శ్రీ త్యాగరాజన్ రవికుమార్ గారు, TGHMA జిల్లా అధ్యక్షులు

శ్రీ గుగులోతు చంద్రభాను గారు, TGHMA జిల్లా ప్రధాన కార్యదర్శి

శ్రీ పెచ్చెట్టి చంద్రశేఖర్ రావు గారు, TSUTF జిల్లా అధ్యక్షులు

శ్రీ మడూరి వెంకటేష్ గారు, TSUTF జిల్లా ప్రధాన కార్యదర్శి

శ్రీ ఆలేటి యాదవరెడ్డి గారు, TSUTF మండల అధ్యక్షులు

శ్రీ బైరగోని పవన్ కుమార్ గారు, TSUTF మండల ప్రధాన కార్యదర్శి

ఆహ్వానితులు : జనగామ జిల్లా మరియు రఘునాథపల్లి మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ఆహ్వానించువారు :

**ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ మరియు విద్యార్థులు**

**ZPHS ఇబ్రహీంపూర్, మం॥ రఘునాథపల్లి, జి॥ జనగామ.**